క్లుప్తంగా

ప్రతిమకు నివాళి



ప్రతిమ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం: తిరుపతి 16వ వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకురాలు ప్రతిమ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న తిరుపతి కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి ప్రతిమ నివాసానికి వెళ్లి ఆమె భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

జయశంకర్‌కు అరుదైన గౌరవం



జీవితకాల సభ్యత్వం అందజేసిన థాయిలాండ్ ఫిజిక్స్ అసోసియేషన్ సభ్యులతో జయశంకర్

తిరుపతి సిటీ : ఎస్వీయూ భౌతికశాస్త్ర విభాగం విశ్రాంత ప్రొఫెసర్ సీకే జయశంకర్‌కు అరుదైన గౌరవం లభించింది. థాయిలాండ్ ఫిజిక్స్ అసోసియేషన్ ఆయనకు జీవితకాలపు సభ్యత్వం కల్పించింది. దీంతో ఆయన ఈ ఘనత సాధించిన మొట్టమొదటి భారతదేశపు భౌతిక శాస్త్రవేత్తగా చరిత్ర సృష్టించారు. థాయిలాండ్ వేదికగా ఈనెల 5వ తేదీ నుంచి 7వరకు జరిగిన సియా ఫిజిక్స్ కాంగ్రెస్–2024 కార్యక్రమంలో ఆయన పాల్గొని అధ్యక్షత వహించి కీలక ఉపన్యాసం చేశారు. కార్యక్రమం ముగింపు రోజున ఆయనకు ఫిజిక్స్ అసోసియేషన్ చెందిన కింగ్‌మోంగ్‌కుట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రొఫెసర్ విసను పెచరసా, నకోన్ ఫాతోమ్ రాజాభట్ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ జక్రాపాంగ్ కైనోఖావో జీవితకాల సభ్యత్వాన్ని ఆయనకు అందజేశారు. ఈ ఘనత సాధించిన ఆయనకు ఎస్వీయూ వీసీ, బోధన, బోధనేతర సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

భక్తిశ్రద్ధలతో మండల పూజ



పిచ్చాటూరు: మండలంలోని గోవర్ధనగిరిలో ఉన్న సిద్ధి వినాయక స్వామివారి ఆలయంలో ఆదివారం మండల పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నూతనంగా నిర్మించిన ఈ ఆలయానికి కుంభాభిషేకం జరిపి, 40 రోజులు పూర్తి కావడంతో మండల పూజ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి, విశేషాలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం సిద్ధి వినాయక స్వామివారి ఉత్సవమూర్తిని గ్రామంలో ఊరేగించారు. భక్తులు కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతులతో స్వామి వారికి నీరాజనాలు పలికారు.

రైతులకు వరం.. బిందు సేద్యం

- తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి
- బీడు భూములు సైతం సాగులోకి..
- ఈ ఏడాది 1035 మంది రైతులకు బిందుసేద్యం పరికరాలు
- 2,823 ఎకరాల్లో పంటల సాగు





కేవీబీపురం: కళత్తూరులో సబ్సిడీపై పంపిణీ చేసిన డ్రిప్ పరికరాలను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

తిరుపతి అర్బన్: వ్యవసాయంపైనే ఆధారపడి జిల్లాలో 80శాతం కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. అయితే జిల్లాలో పలు ప్రాంతాల్లో సాగుకు భూములు సిద్ధంగా ఉన్నప్పటికీ అవసరమైన మేరకు సాగునీటి వసతులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే తక్కువనీటితో ఎక్కువ పంటలు సాగుచేయడానికి బిందుసేద్యం రైతులకు ఓ వరంగా మారింది. ఈ మేరకు రాయితీలతో అందిస్తున్న బిందు సేద్యం పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాల్సి ఉంది.

తిరుపతి జిల్లాలో బిందు సేద్యం

సూక్ష్మ నీటి సాగు పథకం 2023–24కు సంబంధించి 5 వేల ఎకరాల్లో రాయితీలతో పరికరాలు అందించారు. బిందుసేద్యం చేయడం ద్వారా నీరు ఆదా కావడమే కాకుండా దిగుబడులు పెరగడం, పంట నాణ్యతలో వృద్ధి తదితర అనేక ప్రయోజనాలు కలుగుతున్నాయి. బిందు సేద్యం ద్వారా ప్రధానంగా మామిడి, బత్తాయి, నిమ్మ, సపోటా, అరటి, కూరగాయలు, మిరప, ఆయిల్ పామ్, చెరకు, మల్బరీ తదితర పంటలను సాగుచేస్తున్నారు. స్ప్రింక్లర్ల సేద్యంతో ప్రధానంగా వేరుశనగ, మినుము పంటలను సాగులోకి తీసుకురావడానికి ఎంతో అనుకూలంగా ఉంటుందని అంతా భావిస్తున్నారు.

బిందు సేద్యంతో ప్రయోజనాలు...

- నీటి ఆదా..
- విద్యుత్ శక్తి ఆదా
- ఎరువుల వినియోగంలో ఆదా
- పంట ఉత్పాదకత పెరుగుదల
- మొక్క పెరుగుదల బాగుంటుంది
- అధిక దిగుబడి
- పురుగులు, తెగుళ్ల ప్రభావం తగ్గుతుంది
- కలుపు మొక్కల బెడద ఉండదు

దరఖాస్తు చేసుకునే విధానం..

రాయితీపై డ్రిప్, స్ప్రింక్లర్లు పొందడానికి ఆధార్ కార్డు, తహసీల్దార్ల నుంచి ధ్రువీకరణపత్రం, భూమి యాజమాన్య పత్రం లేదా 1బీ రికార్డుతో రైతు భరోసా ద్వారా నేరుగా దరఖాస్తు చేసుకునే సౌకర్యాన్ని కల్పించారు. తప్పనిసరిగా రైతు ఫోన్ నంబర్‌ను నమోదు చేయించుకోవాలి. దాంతో ఎప్పటికప్పుడు ప్రభుత్వం అందిస్తున్న అన్ని రాయితీల వివరాలను మెసేజ్ రూపంలో రైతులకు చేరుతుంది.

రాయితీలు ఇలా..!

డ్రిప్ పరికరాలకు సంబంధించి 5 ఎకరాల లోపు చిన్న, సన్నకారు రైతులకు యూనిట్ ధరలో 90శాతం రాయితీ లభిస్తోంది. 8 ఎకరాలు పైన 10 ఎకరాలు లోపు ఉన్నవారికి 70శాతం రాయితీ ఉంటుంది. స్ప్రింకర్లు అయితే 5 ఎకరాల లోపు సన్న, చిన్నకారు రైతులకు యూనిట్ ధరలో 50 శాతం రాయితీ, 5ఎకరాలకు పైన 10 ఎకరాలకు లోపు ఉన్నవారికి 45శాతం రాయితీ ఉంటుంది. ఈ మేరకు రైతులు ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని సద్వినియోగం చేసుకోవాల్సి ఉంటుంది.

2023–24 నియోజకవర్గాల వారీగా బిందుసేద్యం వారు సాధించిన ప్రగతి

మండలం	రైతులు	ఎకరాలు	వ్యయం (రూ.లక్షల్లో)
చంద్రగిరి	261	704.94	225.85
గూడూరు	317	926.23	378.27
నగరి	67	171.17	61.77
సత్యవేడు	178	485.03	213.42
శ్రీకాళహస్తి	93	225.21	90.44
సూళ్లూరుపేట	45	111.72	41.82
వెంకటగిరి	74	198.93	69.13
మొత్తం	1035	2823.23	1080.69

శ్రీవారి సేవలో ప్రముఖులు



శ్రీవారి దర్శించుకున్న సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవాల విజయశ్రీ



మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

తిరుమల: తిరుమల శ్రీవారిని ఆదివారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవాల విజయశ్రీ, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, తెలంగాణ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.



తెలంగాణ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



చంద్రగిరి(తిరుచానూరు): వేసవి సెలవుల నేపథ్యంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తిరుపతికి చెందిన పలు నాట్యసంస్థల ఆధ్వర్యంలో నాట్య గురువు సుజేందర్ బాబు నేతృత్వంలో భరత నాట్యం, కూచిపూడి నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. ఇందులో భాగంగా అన్నమయ్య కీర్తనలు, త్యాగరాజు కీర్తనలు, ఆంధ్ర జానపద నృత్యాలు, తరంగం కూచిపూడి అంశం, కృష్ణ నృత్యం తెలంగాణ వంటి పాటలకు కళాకారులు తిరుపతికి చెందిన భవ్యశ్రీ బృందం, బెంగళూరుకు చెందిన దివ్యపాలక్ష బృందం, శృతి శంకర్ బృందం, హైదరాబాద్‌కు చెందిన నటరాజ నాట్యాలయం కూచిపూడి, బ్లూమింగ్ డేల్ నాట్యాలయం ఆధ్వర్యంలో భరత నాట్యం, తిరుపతి లలితాంబిక నృత్యాలయం ఆధ్వర్యంలో భరతనాట్యం, నాట్యరవళి డ్యాన్స్ అకాడమి ఆధ్వర్యంలో భరతనాట్యం, నటరాజ నృత్యాలయం ఆధ్వర్యంలో భరత నాట్యం, తీక్షణ భరతనాట్యం, హైదరాబాద్‌కు చెందిన సువర్ణ బృందం భరతనాట్యం ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మూడు రాష్ట్రాలకు చెందిన కళాకారులు విభిన్న సంస్కృతులకు చెందిన నాట్యాలు అలరించాయి. పాటకు తగ్గ అభినయం, హావభావాలతో కళాకారులు చూడచక్కని నత్యాలను ప్రదర్శించడం ద్వారా ప్రేక్షకులు కరతాళ ధ్వనులతో వారిని అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కళాకారులను ఏఓ ఖాదర్‌వల్లీ సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో రాధాకృష్ణ, పప్పి, వరప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



నాట్య ప్రదర్శనతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న కళాకారులు

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ప్రతిభ





జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులతో నారాయణ విద్యాసంస్థ డీజీఎం, ర్యాంకులు సాధించిన విద్యార్థులతో శ్రీచైతన్య విద్యాసంస్థ డీన్‌లు

తిరుపతి ఎడ్యుకేషన్ : దేశంలోని ప్రముఖ ఐఐటీ విద్యాసంస్థల్లో ప్రవేశాలకు నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షా ఫలితాల్లో తిరుపతి నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు జాతీయస్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించి ప్రభంజనం సృష్టించారు. ఈ మేరకు ఆదివారం విద్యాసంస్థలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీజీఎం కొండలరావు వివరాలను వెల్లడించారు. ఈ ఫలితాల్లో ఈడబ్ల్యుఎస్‌పీడబ్ల్యు కేటగిరీలో జి.జ్యోష్మిత ఆల్ ఇండియా మొదటి ర్యాంకును సాధించినట్లు తెలిపారు. అలాగే ఓపెన్ కేటగిరీలో జాతీయ స్థాయిలో ఎస్.వివేకానంద్ 324వ ర్యాంకు, ఆర్.పుష్కర్ 886, శ్రీవివస్వత్ 1,008, దినేష్ ప్రసాద్ 1,366, జస్వంత్ 1,892, హితేష్ 2,438, ప్రకాష్ 2,617, మైత్రిశ్రీ 3,338, ఆదిత్య నివాస్ 6,938, సుహాస్ 7,062, బాలాజీ 7,151, కిరణ్‌కుమార్ 7,480, వెంకటేష్ 8,739, నాగశ్వేత 8,754, జ్ఞానతేజ వర్మ 9,024వ ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. ఓపెన్‌తో పాటు వివిధ కేటగిరీలో వెయ్యిలోపు 11మంది, వీరితో పాటు 50మందికి పైగా ఐఐటీ విద్యాసంస్థల్లో, 100మందికి పైగా ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించే ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులను ఆ విద్యాసంస్థ కోర్‌డీన్ శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ సురేష్, ఏజీఎం గోపీచంద్, అధ్యాపకులు అభినందించారు.

అమరావతి ప్రభంజనం



పి.గోకుల్ | జి.నిశ్చల్ | టి.మణిదీప్‌రెడ్డి

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో తిరుపతిలోని అమరావతి ఐఐటీ జేఈఈ అకాడమీ విద్యార్థులు జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించి విజయకేతనం ఎగురవేశారు. ఈ ఫలితాల్లో పి.గోకుల్ జాతీయ స్థాయి 46వ ర్యాంకు, జి.నిశ్చల్ 662, టి.మణిదీప్‌రెడ్డి 842, కె.ప్రేమజ 1429, షేక్ హఫీఫా 2178, ఆర్.ఆషి 2512, కె.దర్శిని 3559, ఎ.నందీశ్వర్‌రెడ్డి 3780, కె.రుషిత 5603, ఎస్.కారుణ్యకీర్తి 7219, జి.రవీంద్ర 7367, కె.మనోజ్‌కుమార్ 7929, పి.తారకరామ్ 12977వ ర్యాంకులు సాధించారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను విద్యాసంస్థ చైర్మన్ బీవీ.కృష్ణారెడ్డి, వైస్‌చైర్మన్ పార్థీవ్‌రెడ్డి అభినందించారు.

శ్రీచైతన్య విజయకేతనం..

జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షా ఫలితాల్లో తిరుపతిలోని శ్రీచైతన్య విద్యాసంస్థ విద్యార్థులు వివిధ కేటగిరీల్లో జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు విద్యాసంస్థల ఏజీఎం బీవీ.ప్రసాద్ తెలిపారు. ఈ ఫలితాల్లో ఈ.రోహిత్ 384, వై.లిఖిత్ 555, జి.యశ్వంత్‌సాయి 1024, ఎ.గణేష్‌కుమార్‌రాజు 1862, టి.పవిత్ర 3028, ఎ.సాయితేజ 3157, కెపి.మోక్షిత 3390, ఈ.లక్ష్మణ్ 3678, టి.వేణికాచౌదరి 3753, ఈ.కుమార్‌రెడ్డి 4929, పి.జిజ్ఞాస 7091, కె.జీవన్‌కుమార్ 7400, కె.శిరీష 7536, పి.పుష్పాంజలి 9281, జి.దివ్యకీర్తి 9602వ ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. తమ విద్యార్థులు అన్ని కేటగిరిలో కలిపి 58మందికిపైగా దేశంలోనే ప్రతిష్టాత్మక ఐఐటీ విద్యాసంస్థల్లో సీట్లు సాధించే ర్యాంకులను కైవసం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులను విద్యాసంస్థ డీన్‌లు కెఎల్‌జి.ప్రసాద్, రామ్మోహన్‌రావు, సంపత్‌కుమార్, భాస్కర్, ప్రిన్సిపల్స్, అధ్యాపకులు అభినందించారు.

ఆర్చరీ పోటీల్లో 'మణి'రత్నం



నాయుడుపేటటౌన్ : పట్టణానికి చెందిన గణేష్ మణిరత్నం అనే విద్యార్థి ఆర్చరీ పోటీల్లో సత్తా చాటాడు. అంతర్జాతీయ స్థాయిలో రాణించి కాంస్య పతకం సాధించాడు. ఆదివారం ఈ మేరకు కోచ్ కమల్ కిషోర్ వివరాలు వెల్లడించారు. దక్షిణ కొరియాలో ఈ నెల 3 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించిన ఆర్చరీ 2024– ఆసియా కప్‌లో భారత్ తరపున బరిలో దిగిన గణేష్ మణిరత్నం అత్యుత్తమ ఆటతీరును కనబరచినట్లు తెలిపారు. గత ఏడాది సైతం ఐర్లాండ్‌లో జరిగిన ప్రపంచ యూత్ ఆర్చరీ చాపింయన్ షిప్‌లో సైతం రజత పతకం దక్కించుకున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా పతకం సాధించిన గణేష్ మణిరత్నం, కోచ్ కమల్ కిషోర్‌ను ఏపీ ఆర్చరీ సంఘం కార్యదర్శి సత్యనారాయణ అభినందించారు. ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరం చదువుతున్న మణిరత్నం, తల్లిదండ్రు హరిప్రసాద్, సుప్రియకు పలువురు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

రామోజీరావుకు నివాళులు



రామోజీరావుకు నివాళులు అర్పిస్తున్న పాత్రికేయులు

తిరుపతి(అలిపిరి): తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి జర్నలిస్టులు పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సీనియర్ పాత్రికేయులు మాట్లాడుతూ రామోజీరావు మృతి అక్షర సమాజానికి తీరని లోటని.. పత్రికా రంగానికి వయసు అడ్డు రాదని.. వయోవృద్ధుడైనా చివరి రోజుల్లోనూ పత్రికా రంగంలో తన మేధస్సుకు పదును పెట్టే వారని తెలిపారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ కార్యదర్శి బాలచంద్ర, ట్రెజరర్ శ్రీకాంత్, ఏపీయూడబ్ల్యూజే సీనియర్ నాయకులు, ఏపీ పత్రికా సంపాదకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా లక్ష్మీపతి, ఏపీ ఫొటోగ్రాఫర్ల సంఘం నాయకులు గిరిబాబు, సీనియర్ పాత్రికేయులు, రచయితలు, ఎలక్ట్రానిక్ మీడియా నాయకులు, ఫొటో, వీడియో జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

'హే సిరి అలా వెళ్లకే' షూటింగ్ ప్రారంభం




చిత్రం చిత్రీకరణలో పాల్గొన్న యూనిట్

తిరుపతి(అలిపిరి): షీలోక్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై షీలా లోకనాథన్ నిర్మిస్తున్న ×హే సిరి అలా వెళ్లకే₹ వెబ్ సిరీస్ చిత్రం ఆదివారం మానస సరోవర్ హోటల్ వద్ద ప్రారంభమైంది. రచయిత భరత్, దర్శకులు క్రిస్టోఫర్ మాట్లాడుతూ ఇది ఒక ప్రేమ కథా చిత్రమన్నారు. విభిన్నమైన కథాంశంతో సాగుతోందన్నారు. ఇందులో హాస్యం, భావోద్వేగాలతో కూడిన సన్నివేశాలు ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతాయని తెలిపారు. ఇందులో హీరోగా సాయి, హీరోయిన్‌గా షీలా లోకనాథన్, ఇతర ముఖ్యపాత్రలో మోనికా రాజ్, కామెడీశాస్త్రి, వినుకొండ రవి, సుభాష్ చంద్రబోస్, గురప్ప నాయుడు, భరణి కుమార్, బేబీ అభిజ్ఞ, శోధన నటిస్తున్నారు. రచన భరత్, జీ9 ఫిలిం ఫ్యాక్టరీ చిత్ర నిర్మాణ సంస్థ సహాయ సహకారాలతో ఈ సినిమా 32 రోజుల్లో తిరుపతి పరిసర ప్రాంతాల్లో జరుగుతుందని దర్శకులు, ఎడిటర్ క్రిస్టోఫర్ తెలిపారు.

జాతీయ పతాకంపై చిన్నచూపా !



నేడు జాతీయ జెండా లేకుండా బోసిగా కనిపిస్తున్న దృశ్యం



నాడు రెపరెపలాడుతున్న జాతీయ జెండా

తిరుపతి నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్ సమీపంలో ఇటీవల 100 అడుగుల జాతీయ జెండా ఏర్పాటు చేశారు. అయితే వారం రోజుల క్రితం నగరంలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈక్రమంలో జాతీయ జెండా సైతం చినిగిపోయి నేలకు ఒరిగింది. తిరుపతి నగర ప్రజలతో పాటు శ్రీవారి దర్శనార్థం వచ్చే వేలాది మంది భక్తుల్లో దేశభక్తిని మేలుకొల్పేలా ఏర్పాటు చేసిన జెండా చినిగిపోయిందని తెలిసినా నగర పాలక సంస్థ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. జాతీయ జెండా పట్ల గౌరవం లేదా ? అంటూ అధికారులపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జాతీయ జెండాను త్వరగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

ఘనంగా గంగమ్మ తిరునాళ్ల

సత్యవేడు: మండలంలోని నరసరాజు అగ్రహారంలో మూడురోజుల పాటు గంగమ్మ తిరునాళ్లు నిర్వహించనున్నారు. 9, 10, 11 తేదీల్లో తిరునాళ్ల నిర్వహిస్తారు. ఆదివారం ఉదయం 8 గంటలకు గ్రామంలో పోతురాజు ముందు నడువగా అంకమ్మ గంగపెట్టె, చెల్లాతమ్మ కలశం, అంకమ్మ కలశాలు వీధుల్లో ఊరేగింపుగా తీసుకుని గంగమ్మ గుడి వద్దకు వెళ్లారు. పోతురాజు గంగమ్మపెట్టె, కలశాలకు ఇంటింటా భక్తులు కొబ్బరి కాయలు కొట్టి, పసుపునీళ్ల చల్లి మొక్కులు చెల్లించుకొన్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు కలశ స్థాపన నిర్వహించారు. మధ్యాహ్నం మూడు గంటలకు పుట్ట బంగారం తెల్చి హోమం, గణపతి పూజలు చేశారు. సాయంత్రం 6 గంటలకు వీధుల మలుపుల వద్ద రక్షాబంధనం (కాపు కట్టుట) కట్టారు.

హరివిల్లు సోయగం..



ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుమల తిరుపతిలో ఆదివారం స్వల్ప వర్షం కురిసింది. ఈ క్రమంలో ఆకాశంలో ఏడు రంగుల హరివిల్లు తిరునగరంలో కనువిందు చేసింది. ఇది చూసిన ప్రకృతి ప్రేమికులు తమ సెల్ ఫోన్లలో హరివిల్లును ఫొటోలు తీసుకున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి